క్లుప్తంగా

కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం

లక్ష్మీపురం: భారత రాజ్యాంగాన్ని కాలరాస్తున్న నరేంద్ర మోదీ విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. గుంటూరు నగరంలో సంగడిగుంట, డీఎస్ నగర్, ఏటుకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో శనివారం ప్రచార ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్. చిన్న, హమాలీ ముఠా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్నాంజనేయులు, ముఠా కార్మిక సంఘం నగర అధ్యక్షులు జి.సురేష్ బాబు, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, నాయకులు పి.రోసి రెడ్డి, వి.శ్రీను, బి.కొండ, కె. కోటయ్య, ఆదం, ఎం.పిచ్చయ్య,పాల్, ఓంకార్ పాల్గొన్నారు.

బృందావన్ గార్డెన్స్‌లో వెస్ట్ డీఎస్పీ తనిఖీలు



లక్ష్మీపురం: పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బృందావన్ గార్డెన్స్‌లో వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ శనివారం రాత్రి పర్యటించారు. వాహనాలను తనిఖీలు చేశారు. మైనర్లు వాహనాలను నడిపే వారిని గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రోన్ కెమెరాల ద్వారా ఖాళీ ప్రదేశాలలో బహిరంగంగా మద్యం, మత్తు పదార్థాలు తీసుకునే వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఆయన వెంట పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐలు నరహరి, ఆంజనేయులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

లక్ష్మీపురం: నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ప్రగతిశీల కార్మిక సమాఖ్య గుంటూరు జిల్లా కమిటీ వేసిన కరపత్రాలను సంస్థ రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి ఆవిష్కరించారు. లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న కార్మికులకు రోజుకు ఎనిమిది వందలు వేతనం చెల్లించాలని అలాగే ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ఉదయం పది గంటలకే పని ముగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ ఖాజావలి, ఎస్.పోతురాజు, రాజశేఖర్, ఆంథోనీ పాల్గొన్నారు.

మే 20న దేశ వ్యాప్త సమ్మె

లక్ష్మీపురం: నిర్మాణ రంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాల్సిందిగా సీఐటీయూ అనుబంధ సంస్థ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ పిలుపు నిచ్చారు. స్థానిక పాతగుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ నెల 24వ తేదీన భవన నిర్మాణ కార్మిక సమస్యల మీద మంత్రి నారా లోకేష్ గారికి వినతిపత్రం ఇవ్వాలని సంఘం నిర్ణయించిందన్నారు. సీఐటీయూ తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు, కోశాధికారి టీ శ్రీనివాసరావు, సభ్యులు పి.విమల్ కుమార్, జె రాజు, చావలి ఏజీ వెంకటేశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు.

రజక మహిళపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలి

లక్ష్మీపురం: రజక మహిళాపై దారుణంగా దాడి చేసి తీవ్రమైన పదజాలంతో దూషించిన వారిని అరెస్ట్ చేసి బాధితురాలకు తగిన న్యాయం చేయాలి నేషనల్ దోబీ మహా సంఘం అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. జేకేసీ కళాశాల రోడ్డులోని అపార్టమెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న మహిళపై విచక్షణారహితంగా దాడిచేసి బూతులు తిట్టిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వాచ్‌మెన్‌గా ఉంటున్న మహిళపై విచక్షణారహితంగా నడి రోడ్డు పైన జుట్టు పట్టుకుని క్రరతో దాడి చేసిన తండ్రీకొడుకులను తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోని న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. స్థానిక పట్టాభిపురం పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దుర్గారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నెహ్రూనగర్: నగరంలో రజక మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత మహిళను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ విజయపూరి కాలనీలో గార్లపాటి అంజయ్య, అతని భార్య సీతమ్మ వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారని..ఈ క్రమంలో సీతమ్మపై ఎదురుగా ఉండే ఓ వ్యక్తి చిన్న పాటి విషయానికి గొడవ పెట్టుకుని విచక్షణ రహితంగా కొట్టారని ఆరోపించారు. దాడి చేసిన వ్యక్తి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్‌తో రజకులపై ఇలాంటి దాడులు జరగకుండా ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యం పట్టడం లేదు..

- అదనంగా వర్కర్లు పెట్టినా ఫలితం శూన్యం
- ఎమ్మెల్యేలను నిలదీస్తున్న నగర వాసులు
- శివారు ప్రాంతాల్లో కనిపించని చర్యలు



నగరంలో చెత్తను రోడ్డుపై పోస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నెహ్రూనగర్: పారిశుద్ధ్య సమస్య వెంటాడుతోంది. నిర్వహణకు చేపడుతున్న చర్యలు ఫలితం ఇవ్వడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ కోసం తీసుకున్న చర్యలతో అదనంగా సమస్యలు వస్తున్నాయి. నగరంలో ఎక్కడ కూడా గార్బేజ్ పాయింట్లు ఉండటానికి వీల్లేదని.. అవి కనిపిస్తే సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలే బాధ్యత వహించాలని కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నాయి. ఇది కార్మికులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది.

చెత్త సేకరణ ఇలా..

గతంలో నగరంలో రోజుకు 400 మెట్రిక్ టన్నుల చెత్త వచ్చేది. ప్రస్తుతం సుమారుగా 470 మెట్రిక్ టన్నులకు పెరిగింది. ప్రజలు నుంచి పారిశుద్ధ్య పనులపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కమిషనర్ పులి శ్రీనివాసులు అదనంగా సుమారు 150 మంది కార్మికులను రోజు వారి రూ.500 కూలీ చొప్పున నియమించారు. వీరంతా కూడా పైపైన పనులు చేసుకుంటూ వెళ్లిపోతున్నారు. దీంతో పాటు ప్రధానమైన ప్రాంతాల్లోనే పారిశుద్ధ్యం మెరుగ్గా చూపించి శివారు కాలనీల్లో పారిశుద్ధ్యాన్ని గాలికొదిలేశారు.

103 సిబ్బంది తొలగింపు..

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం సుమారు రెండు వేల మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో గత కొద్ది రోజుల క్రితం ఆప్కాస్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వయస్సు 60 ఏళ్లు దాటిందానే సాకుతో వారిని విధుల నుంచి తొలగించారు. తొలగించిన వారి స్థానంలో కొత్త వారిని తీసుకోకపోవడంతో వారు చేయాల్సిన పని మిగిలిన వారిపై పడుతోంది. స్వచ్ఛభారత్–స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో భాగంగా నగరానికి మెరుగైన ర్యాంకు సాధించేందుకు డంపర్ బిన్లను తొలగించిన విషయం తెలిసిందే. దీంతో చెత్తను సకాలంలో తరలించేందుకు నగర పరిధిలో 39 చెత్త తరలించే ట్రాక్టర్లు, 18 కంప్యాక్టర్ బిన్ల సాయంతో చెత్తను తరలిస్తున్నారు. దీంతో పాటు అదనంగా కొన్ని ట్రాక్టర్లు అద్దెకు తీసుకున్నారు. నగరంలో ఉత్పన్నమయ్యే చెత్తను రోడ్ల మీద వేయకుండా ఎప్పటికప్పుడు తరలించే ప్రక్రియ జరగాలని కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కాని చెత్త మాత్రం రోడ్డు మీద కనిపిస్తునే ఉంది. దీనిపై ప్రజారోగ్యధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, సకాలంలో చెత్త తరలింపు జరగడంలేదని గత రెండు రోజుల క్రితం తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను 54వ డివిజన్ వాసులు నిలదీశారు.

గుంటూరు నగరంలో	
గృహాలు	3 లక్షల
శానిటరీ డివిజన్లు	32
రోజు సేకరించే చెత్త	470 టన్నులు
పారిశుద్ధ్య కార్మికులు సంఖ్య	2 వేల మంది
ట్రాక్టర్లు	39
కంప్యాక్టర్ బిన్స్	18

పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక కృషి



నగరంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నాం. ప్రతి డివిజన్ కు అవసరమైన పుష్ కార్టులు, డస్ట్ బీన్లు ఇవ్వడం జరిగింది. చెత్తను రోడ్డు మీద వేయకుండ.. ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. శానిటరీ సెక్రటరీలు ఉదయం మధ్యాహ్నం విధుల్లో ఉంటూ సిబ్బంది హాజరు, పారిశుద్ధ్య పర్యవేక్షణ చేసే విధంగా తగిన ఆదేశాలు జారీ చేశాం.

– పులి శ్రీనివాసులు, నగర కమిషనర్

ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం చేయాలి

కమిషనర్ శ్రీనివాసులు



సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా ప్రజారోగ్య విభాగం క్షేత్ర స్థాయిలో పిన్ పాయింట్ ప్రోగ్రాం సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం కమిషనర్ కేవీపీ కాలనీ, ఆర్.అగ్రహారం, శారదా కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా చేయవచ్చన్నారు. డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఇన్ స్పెక్టర్లు, ఎస్ఎస్‌లు మధ్యాహ్నం సమయంలో కార్మికులు డ్రెయిన్లు శుభ్రం చేసేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ కార్యదర్శులు, కార్మికులు వ్యర్థాలను తడిపొడిగా వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు. కమర్షియల్ సంస్థలు వ్యర్థాలను రోడ్ల మీద వేయకుండా నోటీసులు ఇవ్వాలని, పునరావృతం అయితే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని కోరారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ మధుసూదన్, ఎస్ఎస్ ఐజాక్ పాల్గొన్నారు.

శంకర్ విలాస్ వద్ద ఆర్‌యూబీ నిర్మించాలి

కార్మిక సంఘాల డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు కె.నళినికాంత్

లక్ష్మీపురం: ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా శంకర్ విలాస్ వద్ద ఆర్‌యూబీ నిర్మించాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు కె.నళినికాంత్ డిమాండ్ చేశారు. బ్రాడీపేట సీఐటీయూ కార్యాలయంలో ఆటో కార్మిక సంఘాల రౌండ్ సమావేశం శనివారం నిర్వహించారు. నళినికాంత్ మాట్లాడుతూ నగరంలో కొద్ది రోజుల క్రితం మూడు వంతెనలు రిపేర్లు వస్తే శంకర్ విలాస్ బ్రిడ్జి వద్ద విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైందని గుర్తు చేశారు. 90 శాతం ట్రాఫిక్ అవసరాలు తీర్చే శంకర్ విలాస్ బ్రిడ్జి రాకపోకలు నిలిపివేస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతినకుండా ఉండాలంటే ఆర్‌యూబీ తప్పనిసరి అని పేర్కొన్నారు. మూడు వంతెనలు, కంకర గుంట ఆర్‌యూబీ ద్వారా ట్రాఫిక్ మళ్లించడం అసాధ్యమని వివరించారు. అత్యవసర సర్వీసులైన గవర్నమెంట్ ఆస్పత్రి, ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు ఆర్‌యూబీ ద్వారా సులువుగా, సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.శంకర్‌రావు, ఏపీఎఫ్‌టీయూ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.రవి, వైఎస్సార్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు పవన్, స్కూలు ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.మురళి, సీఐటీయూ నగర తూర్పు, పశ్చిమ ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, ఆటో యూనియన్ నాయకులు గండికోట శంకరరావు, కె.ఏడుకొండలు, రాంబాబు, బాలయ్య పాల్గొన్నారు.

కాలేయ మార్పిడి లేకుండానే కిమ్స్ వైద్యుల చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్, పక్కన చికిత్స పొందిన మహిళ

గుంటూరు మెడికల్: కాలేయ మార్పిడి లేకుండా మహిళకు ఆధునిక సాంకేతిక సాయంతో శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడినట్లు కిమ్స్ శిఖర ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్యులు ప్రసన్నకుమార్, ప్రతాప్ మౌళి, విష్ణుప్రసాద్, శరత్‌చంద్ర వివరాలు వెల్లడించారు. 25 ఏళ్ల మహిళ ఎలుకల మందు తిని, తీవ్రమైన (జాండీస్), కాలేయ వైఫల్యంతో వారం రోజుల క్రితం గుంటూరు కిమ్స్–శిఖర ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితిలో చేరిందని తెలిపారు. విష ప్రభావంతో కాలేయం తీవ్రంగా దెబ్బతినడంతో అంతర్గత రక్తస్రావం, జాండీస్‌తో బాధపడుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో కాలేయ మార్పిడి తప్పనిసరి, కానీ, దాత కాలేయం అందుబాటులో లేకపోవడం వలన, వైద్యులు ఆధునిక వైద్య సాంకేతికతో ప్లెక్స్ థెరపీ వినియోగించినట్లు వివరించారు. మహిళ కోలుకోగా శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ఈ కేసు ద్వారా ప్లెక్స్ థెరపీ ప్రాణ రక్షణలో ఎంత కీలకమో, అలాగే కిమ్స్–శిఖర వైద్య బృందం నైపుణ్యం ఎంత ఉన్నతమో మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. ఇది కాలేయ వైఫల్యం గురైన మరిన్ని రోగులకు కొత్త ఆశలు కలిగిస్తోందని వెల్లడించారు.

13న సమైక్యత శంఖారావం జాతీయ మహాసభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

లక్ష్మీపురం: దేశంలో మతసామరస్యం వర్ధిల్లాలి మతోన్మాదం నశించాలి అనే నినాదంతో ఈనెల 13వ తేదీన విజయవాడ నగరంలోని సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించనున్న సమైక్యత శంఖారావ మహాసభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో శనివారం సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మోని ఆధ్వర్యంలో ఏర్పాటు సమావేశం పోస్టర్ ఆవిష్కరించారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిస్తీ మాట్లాడుతూ మన రాష్ట్రంలో బీజేపీ కుట్రతో ప్రాంతీయ లౌకిక పార్టీలని ఉపయోగించుకునే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎస్.హనుమంత్ రెడ్డి, ముస్లిం ఐక్యవేదిక నాయకులు షేక్ బాజీ, ముస్లిం సమైక్యవేదిక నాయకులు హాజీ అబ్దుల్ కలాం, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్. ఖాజావలి ,ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ బాషా, సీఐటీయూ నాయకులు ఎండీ సలీం, ఇమ్రాన్, ఇన్సాఫ్, వలి పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి..

- భక్తుల సౌకర్యార్థం మౌలిక సౌకర్యాలు ఏర్పాటు
- చలువ పందిళ్లు.. కల్యాణం తిలకించేందుకు ఎల్ఈడీలు
- నేడు నగర పురవీధుల్లో శ్రీరామనవమి శోభాయాత్ర



కొరిటెపాడు సీతారాముల దేవస్థానం ఆవరణలో కల్యాణానికి వేదిక

నగరంపాలెం: శ్రీరామనవమి పండుగను గుంటూరు నగరంలో వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. చలువ పందిళ్లు వేశారు. కొరిటెపాడు, ఆర్అగ్రహారం, ఏటీఅగ్రహారం, బ్రాడిపేట, అరండల్‌పేట, సంపత్‌నగర్, బృందావన్‌గార్డెన్స్, ఎస్‌వీఎన్‌కాలనీ, పాతగుంటూరు, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. గత ఏడేళ్లగా గుంటూరు నగర పుర వీధుల్లో నిర్వహిస్తోన్న శ్రీరామనవమి శోభాయాత్ర ఆదివారం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు ప్రధాన వీధులను దేవతామూర్తుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలను ఏర్పాటు చేశారు. బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఉదయం 9.11 గంటలకు రథయాత్రను ప్రారంభించనున్నారు.

అణగారిన వర్గాల అభివృద్ధికి జగ్జీవన్‌రామ్ కృషి



కౌన్సిల్ హాల్లో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇన్‌చార్జి మేయర్ సజీల



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఈఓ రేణుక

నెహ్రూ నగర్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ ఆదర్శనీయులని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం కొనియాడారు. శనివారం జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి, అనంతరం విజ్ఞాన మందిరం దగ్గరలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య ఉద్యమంలోను, అనంతరం ఆధునిక భారత నిర్మాణంలోనూ అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంహెచ్ఓ డాక్టర్ అమృతం, మేనేజర్ బాలాజి బాషా పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో టెన్త్ మూల్యాంకన కేంద్రంలో శనివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఈఓ రేణుక మాట్లాడుతూ భారత ఉప ప్రధానిగా, కేంద్ర రక్షణశాఖ, వ్యవసాయ శాఖ మంత్రిగా పలు మంత్రి పదవులను అలంకరించిన జగ్జీవన్‌రామ్ ఎంతో నిబద్ధతతో పనిచేసి అందరిని మెప్పించారని అన్నారు. టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ విధుల్లో ఉన్న అధికారులు, ఉపాధ్యాయులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.



హిందూ కళాశాల సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

లక్ష్మీపురం: స్థానిక హిందూ కళాశాల సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలంయలో పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో బిళ్ళా సునీల్, గడ్డంపాల్, విజయ్‌కుమార్, అంబటి రత్తయ్య, వెంకటరెడ్డి, కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు పేర్కొన్నారు. ఆర్టీసీ కాలనీలోని పాఠశాలలో శనివారం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సాయి శ్రీకర్, హెచ్ఎం మీనాక్షి, ప్రిన్సిపాల్ ఎ.కళ్యాణి పాల్గొన్నారు.



సెయింట్ లారెల్స్ స్కూల్ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



నగరంలో జగ్జీవన్‌రామ్ వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో..

గుంటూరు మెడికల్: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దారా అంబేడ్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పాల్గొన్నారు. మార్కెట్ సెంటర్ లో ఉన్న బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.చంద్రశేఖర్, వైవీ సుబ్బారావు, చరక కుమార్ గౌడ్, డి.శ్రీనివాస్, స్టాలిన్, బి.నరసింహారావు, టి.అనిల్, కె.బ్రహ్మయ్య, ఎ.లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాస్తవిక అంశాలతో చిత్రీకరించిన చిత్రం '23'



మాట్లాడుతున్న దర్శకుడు రాజ్ రాచకొండ, చిత్రంలో నటుడు రాయపాటి తేజ, నటి తన్మయి

నగరంపాలెం: బాధితుల, నిందితుల జీవితాల్లో ఎదురైన సమస్యల ఆధారంగా '23' చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు రాజ్ రాచకొండ అన్నారు. 23 చిత్రం దర్శకుడు రాజ్ రాచకొండ, నటుడు రాయపాటి తేజ, నటి తన్మయి శనివారం నగరంపాలెం ఫినిక్స్‌మాల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చిత్ర విశేషాలను తెలిపారు. దర్శకుడు రాజ్ మాట్లాడుతూ సామాజిక అంశాలతో నిర్మించిన చిత్రమని అన్నారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తుందని అన్నారు. ఈ కథకు నూతన నటీనటులతో న్యాయం జరుగుతుందని వారిని ఎంపిక చేశామని చెప్పారు. ఈనెల చివర్లో సినిమా విడుదల చేస్తామని తెలిపారు. నటుడు రాయపాటి తేజ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని అన్నారు. తన స్వస్థలం గుంటూరు అని, తాత రాయపాటి సాంబశివరావు గతంలో ఎంపీగా పనిచేశారని గుర్తుచేశారు. నటి తన్మయి మాట్లాడుతూ తొలి చిత్రమైనా మంచి పాత్ర లభించిందని అన్నారు.

శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు

నగరంలో శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు అయ్యాయి. వాడవాడలా రాములోరి కల్యాణాన్ని తిలకించే విధంగా ఆలయాల వద్ద ప్రత్యేకంగా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం పానకం, వడపప్పు పంపిణీకి ఆలయ కమిటీలు సన్నద్ధమయ్యాయి. -సాక్షి, ఫొటోగ్రాఫర్, గుంటూరు



సాకేతపురం శ్రీరామాలయం వద్ద శ్రీరామనవమి పందిరి



కొరిటెపాడు శ్రీరామాలయం వద్ద శ్రీరామనవమి పందిరి